డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



డాక్టర్ హిమబిందు, ప్రిన్సిపాల్

శంషాబాద్: శంషాబాద్ ప్రభుత్వ డిగ్రీ (రాజేంద్రనగర్) కళాశాలలో డిగ్రీ విద్యాభ్యాసానికి దోస్త్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు తెలిపారు. డిగ్రీ కళాశాలలో బీఎస్సీ (లైఫ్ సైన్స్) బీఎస్సీ (ఫిజికల్ సైన్స్) బీకాం కంప్యూటర్, బీఏ ఆంగ్లమాధ్యమ కోర్సుల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. మొదటి విడత దోస్త్ రెండు విడత వెబ్ ఆప్షన్ ఈ నెల 13 నుంచి ఉంటుందన్నారు. ఇటీవల డిగ్రీ ఫైనల్ ఇయర్‌లో 90 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. శంషాబాద్ డిగ్రీ కళాశాల ఎంపికను దోస్త్ కోడ్ 1283 ఎంచుకోవాలన్నారు. కళాశాలలో కొత్తగా అదనపు గదులు కూడా అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ దఫా రెండు విడతల బోధన కాకుండా ఒకే విడతలో అన్ని గ్రూపుల వారికి బోధించే విధంగా ఏర్పాట్లున్నాయన్నారు. విశాలమైన మైదానం కూడా కళాశాల ప్రాంగణంలోనే ఉందన్నారు. ఇంటర్ ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు దోస్త్ ద్వారా కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రాజకీయ లబ్ధికోసమే ప్రభుత్వంపై ఆరోపణలు

బండ్లగూడ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో జనరంజకంగా పాలన కొనసాగిస్తున్నదని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నల్లగొప్పుల హరీష్‌గౌడ్ అన్నారు. ఆర్టీసీ చార్జీలు పెంచడం కొత్త సంప్రదాయమేమీ కాదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించినప్పటి నుంచి ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ఆర్టీసీ చార్జీలను పెంచారని ఆయన గుర్తుచేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఆర్టీసీ ఇప్పటి వరకు మహిళలు, బాలికలకు విజయవంతంగా ఉచిత ప్రయాణ సేవలు అందిస్తూనే ఉందన్నారు. ఇప్పటి వరకు ఆర్డినరీ బస్సులలో మాత్రమే విద్యార్థులకు ఉచిత ప్రయాణం ఉండేదని.. ప్రస్తుతం దానిని మెట్రో ఎక్స్‌ప్రెస్‌ల వరకు పొడిగించడం జరిగిందన్నారు. బస్ పాసు చార్జీలను 20 శాతం, నిత్యం ప్రయాణించే వారికి కొంత వెసులుబాటుతో మాత్రమే చార్జీలు పెంచడం జరిగిందన్నారు. ఇకనైనా ప్రభుత్వం చేస్తున్న మంచి పనులకు సహకరించాలని ప్రతిపక్షాలకు హితవుపలికారు.

అర్హులందరికీ 'డబుల్' ఇళ్లివ్వాలి: సీపీఐ

రాజేంద్రనగర్: దోపిడీ, దౌర్జన్యం, అక్రమాలకు వ్యతిరేకంగా సీపీఐ శతాబ్దకాలంగా అవిశ్రాంత పోరాటం చేస్తున్నదని సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి, రాష్ట్ర కంట్రోల్ కమిషనర్ సభ్యుడు పుస్తకాల నర్సింగ్ రావు అన్నారు. రాజేంద్రనగర్ మండలంలోని ఎర్రబోడ హైదర్‌గూడ సీపీఐ మండల 3వ మహాసభ మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగింది. మండల కౌన్సిల్ సభ్యుడు పాండు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... వందో వసంతంలోకి అడుగుపెడుతున్న కమ్యూనిస్టు పార్టీ నాటి నుంచి నేటి వరకు ప్రజల పక్షాన నిలబడి కార్పొరేట్ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతున్నదన్నారు. వామపక్ష అర్బన్ నక్సలైట్ల పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం చేస్తుందన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ మండలంలో పేదల పక్షాన ఇళ్ల స్థలాల కోసం భూ పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఎండీ రియాజ్, సీపీఐ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహారెడ్డి మాట్లాడుతూ... మండలంలో ప్రజా సంఘాల నిర్మాణం జరిగితే పార్టీ పటిష్టంగా ఉంటుందన్నారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు. కార్యదర్శిగా కె.పాండు, సహాయ కార్యదర్శులుగా మౌనిక, ఊర్మిళలను ఎన్నుకున్నారు. మండల సహాయ కార్యదర్శి ఎండీ షఫీ, సీపీఐ ఆఫీస్ కార్యదర్శి సత్యం, మొగులయ్య, కృష్ణ, బుజ్జి, ఉపేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

శంకరాపురంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'



ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

శంషాబాద్ రూరల్: శంషాబాద్ మండల పరిధిలోని శంకరాపురంలో మంగళవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. సాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. తగిన మోతాదులోనే పంటలకు ఎరువులు వాడాలని తెలిపారు. సేంద్రీయ సాగులో పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవచ్చని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో నేల ఆరోగ్య యాజమాన్య సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.పవన్ చంద్రారెడ్డి, ఏఈఓ రాఘవేందర్, రైతులు పాల్గొన్నారు.

ఆరాంఘర్‌లో ట్రాఫిక్ సునామీ!

- వాహనదారులకు తప్పని ట్రాఫిక్ కష్టాలు
- వాహనాల రద్దీతో ట్రాఫిక్ పోలీసుల శ్రమ వృథా
- భారీ వాహనాల దారి మళ్లింపే పరిష్కారం: ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్



దుర్గానగర్ నుంచి ఆరాంఘర్ వరకు నిలిచిపోయిన వాహనాలు



ఆరాంఘర్ రైల్వే ట్రాక్ కింద అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ వైర్లు

మైలార్‌దేవ్‌పల్లి: ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు సతమతం అవుతున్నారు. గడచిన ఆరు నెలలుగా ఈ ప్రధాన వన్ వే రహదారిపై 500 మీటర్ల దూరం వెళ్లాలంటే ఒక్కోసారి 20 నిమిషాల సమయం పడుతుందంటే స్థానికంగా ట్రాఫిక్ సమస్యల తీవ్రతను ఇట్టే అర్థం చేసుకోవచ్చు. మధ్యాహ్నం, రాత్రి వేళల్లో వాహనాల రాకపోకలు ఎక్కడివక్కడ స్తంభించిపోతాయి. ఈ సమస్య ఇంకేన్నాళ్లు, పరిష్కారం లేదా అని వాహనదారులు ట్రాఫిక్ పోలీసులను ప్రశ్నిస్తున్నారు.

- మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ దుర్గానగర్ నుంచి ఆరాంఘర్ చౌరస్తా వరకు వంద అడుగుల ప్రధాన వన్ వే రహదారిలో నిత్యం ట్రాఫిక్ జామ్ సమస్యలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంబులెన్స్ ఈ రహదారిలో వచ్చినట్లయితే అందులో ఉన్న రోగులు సకాలంలో ఆస్పత్రికి వెళ్లలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇటీవలి కాలంలో జీహెచ్ఎంసీ వారు రోడ్డుపై ఏర్పడిన గుంతలకు శాశ్వత పరిష్కారంగా సీసీ రోడ్డు వేశారు. సుమారు పది రోజులు రోడ్డుపై వాహనాలు నడవకుండా వేరే ఇతర రహదారికి మళ్లించారు. దీంతో పది రోజులు వాహనదారులు నరకయాతన అనుభవించారు. రోడ్డు వేశాక ట్రాఫిక్ సమస్య తీరుతుందనుకున్న వాహనదారుల ఆశ అడియాశలే అయ్యాయి. ఈ సారి వాహనాల రద్దీ మరింత తీవ్రం అయ్యింది. గుంతలు మూసి సీసీ రోడ్డు వేసిన వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడంలేదు.
- ట్రాఫిక్ సమస్య శాశ్వత పరిష్కారానికి మార్గం అంటున్నారు. ఓల్డ్ కర్నూలు రోడ్డు నుంచి భారీ వాహనాలతోపాటు ఆర్టీసీ బస్సులు నడిపిస్తే దుర్గానగర్ నుంచి ఆరాంఘర్ రోడ్డు పై వాహనాల రద్దీ తీవ్రత తగ్గిపోతుందని స్థానికులు పేర్కొంటున్నారు.
- ఆరాంఘర్ రైల్వే ట్రాక్ కింద హైటెన్షన్ విద్యుత్ పైపులు అస్తవ్యస్తంగా ఉండడం కూడా కొంత మేర ట్రాఫిక్ సమస్యకు కారణం అవుతోందని వాహనదారుల విచారం వ్యక్తం చేస్తున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన విద్యుత్ పైప్‌లైన్ పై నుంచి లేదా అండర్‌గ్రౌండ్ నుంచి తీసుకెళ్లాలని వాహనదారులు సూచిస్తున్నారు.
- రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్ ట్రాఫిక్ కష్టాలు లేకుండా అహర్నిశలు శ్రమిస్తున్నా వాహనదారుల కష్టాలు తప్పడం లేదు.

భారీ వాహనాల మళ్లింపుతోనే...



దుర్గానగర్ సిగ్నల్ నుంచి ఓల్డ్ కర్నూలు రోడ్డు గుండా భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులను తరలిస్తే కొంత మేర ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గుతాయి. అలా చేసి చూస్తాము. ఈ మధ్య కాలంలోనే వాహనాల రద్దీ పెరిగి ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. సమస్య పరిష్కారానికి కృషి చేస్తా.

– రాజేందర్‌గౌడ్, రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

నిత్యం సతమతం



ఈ రహదారి నుంచి రాకపోకలు సాధించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రహదారి పక్కనే మా ఇల్లు ఉన్నది. వాహనాలు దారి పొడవునా నిలిచిపోతున్నాయి. సాయంత్రం వేళల్లో ఆఫీస్ నుంచి ఆరాంఘర్‌కి వచ్చామంటే చాలు ఇంటికి చేరుకునేందుకు 30 నిమిషాలు పడుతుంది. ఈ సమస్య తీరేలా చూడాలని ట్రాఫిక్ పోలీసులను కోరుతున్నా.

– భానుచందర్, మార్కండేయనగర్

ఆకట్టుకున్న చిన్నారుల కర్రసాము ప్రదర్శన



కర్రసామును ప్రదర్శిస్తున్న చిన్నారులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్‌పూర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ద్వారా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేసవి కాలాన్ని పురస్కరించుకోని చిన్నారులకు కర్ర సాము శిక్షణ తరగతులను నిర్వహించారు. దాదాపు 45 రోజుల పాటు కోచ్ రవియాదవ్ ఆధ్వర్యంలో ఈ కర్ర సాము శిక్షణ తరగతులను నిర్వహించారు. ఏప్రిల్ 30వ తేదీ నుంచి జూన్ 10వ తేదీ వరకు ఈ శిక్షణ తరగతుల్లో మొత్తం 180 మంది చిన్నారులు శిక్షణ పొందారు. శిక్షణ పొందిన వారికి ద్వారా ఫౌండేషన్ ఫౌండర్ నిరుడు పవన్‌సాయి ఆధ్వర్యంలో సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ముగింపు కార్యక్రమం సందర్భంగా కిస్మత్‌పూర్‌లోని పాఠశాల ఆ వరణలో విద్యార్థుల ప్రదర్శించిన కర్రసాము విశేషంగా ఆకట్టుకుంది. చిన్నారులే కాకుండా పెద్దలు సైతం కర్రసాము శిక్షణలో పాల్గొని ప్రదర్శించారు.

లక్ష్మీనగర్ సమస్యలను సత్వరమే పరిష్కరించండి

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్



లక్ష్మీనగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ ఆర్.వి.కర్ణన్

అత్తాపూర్: అత్తాపూర్ లక్ష్మీనగర్ కాలనీ సమస్యలు యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జోనల్ కమిషనర్ వెంకన్నతో కలిసి అత్తాపూర్ లక్ష్మీనగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు. కాలనీలో ముఖ్యంగా దోమల సమస్య, మెయిన్ రోడ్డు నుంచి కాలనీ వరకు రోడ్డు వెడల్పు, కాలనీ చుట్టూ ఉన్న మూసీ పరీవాహక స్థలంలో ప్రైవేటు వ్యక్తులు భవన నిర్మాణ వ్యర్థాలను డంప్ చేస్తున్నారని, అందు వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ కర్ణన్ మాట్లాడుతూ... ప్రజల ఇబ్బందులను అధికారులు పక్కా ప్రణాళికతో పరిష్కరించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని ప్రజలకు సూచించారు. అందుకు వీధి వ్యాపారులు, షాపు యజమానులు సింగిల్ ప్లాస్టిక్ వాడకం పై కాలనీ వాసులు అప్రమత్తంగా ఉండి నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరి బాధ్యత అన్నారు. వీధి కుక్కల బెడదను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మూసీ రివర్ బెడ్‌లో రాత్రి సమయంలో భవన నిర్మాణ వ్యర్థాలు, చెత్త, ఆహార వ్యర్థాలు అక్రమంగా డంప్ చేస్తున్నారని వాటిని నియంత్రణ చేయకపోతే వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అధికారులు, సిబ్బంది ప్రజలతో మమేకమై సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తూ సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు. జోనల్ కమిషనర్ వెంకన్న, డిప్యూటీ కమిషనర్ రవికుమార్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్‌కు మంటలు

గృహోపకరణాలు దగ్ధం

శంషాబాద్ రూరల్: ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్‌కు మంటలు అంటుకొని ఇంట్లోని వస్తువులు, దుస్తులు కాలిపోయిన ఘటన మండలంలోని రామంజాపూర్‌తండాలో చోటు చేసుకుంది. వివరాలివీ... తండాకు చెందిన నర్సునాయక్ ఇంట్లోని పడక గదిలో వంట కోసం పొయ్యి ఏర్పాటు చేసుకున్నాడు. మంగళవారం ఉదయం తన ఇంట్లో గ్యాస్ స్టౌ వెలిగించి బయటకు వచ్చాడు. కాసేపటికి సిలిండర్ వద్ద మంటలు వ్యాపించాయి. మంటలతో ఇంటి పైకప్పు రేకులు, వంటింట్లో వస్తువులతో పాటు పడక గదిలోని దుస్తులు కాలిపోయాయి. గమనించిన స్థానికులు వెంటనే నీళ్లతో మంటలు ఆర్పి, సిలిండర్‌ను బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో తండా వాసులు ఊపిరి పీల్చుకున్నారు.



అధ్వానంగా అంతర్గత రహదారులు



గుంతలమయమైన శాస్త్రిపురంలోని ఓ బస్తీ రహదారి

శాస్త్రిపురం: పేరుకే గ్రేటర్ హైదరాబాద్ రోడ్డు కానీ పల్లెల రోడ్ల కంటే అధ్వానంగా ఉంది. గ్రేటర్‌లో విలీనమై సంవత్సరాలు దాటుతున్నా ఇప్పటి వరకు కొన్ని ప్రాంతాల్లోని రహదారులకు మోక్షం కలగడం లేదు. గుంతలు పడి కంకర తేలిన రహదారులకు మరమ్మతులు జరపాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్ల పరిధిలో అంతర్గత రహదారుల పరిస్థితి అధ్వానంగా తయారైంది. కొత్తగా సీసీ రోడ్లు వేయకపోయినా ఉన్న రహదారులకైనా మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శంషాబాద్ రూరల్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారసంగా ననాజీపూర్ ఫీడర్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సురేష్‌రెడ్డి తెలిపారు. 11 కేవీ పరిధిలోని రాయన్నగూడ, ననాజీపూర్, కవేలిగూడ, రామంజాపూర్, బోటిగూడ, రామంజాపూర్‌తండాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

నార్సింగి మున్సిపల్ పరిధిలో...

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీలోని విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున నిర్ణీత సమయంలో సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏఈ మణికంఠ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నార్సింగి గ్రామం, నార్సింగి హైట్స్, క్యూబా కాలనీ, కాస్మో కాలనీ, వివేకానంద నగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మంచిరేవుల, మంత్రి విల్లాస్, గ్రీన్‌లాండ్ లేఅవుట్, జైహింద్ కాలనీలలో విద్యుత్ విద్యుత్ నిలిపివేస్తామని ఏఈ వివరించారు. విద్యుత్ సమస్యలు ఉంటే ఫ్యూజ్ కాల్ నంబర్: 87124 69580లో సంప్రదించాలన్నారు.

శివరాంపల్లి, హసన్‌నగర్, ఎన్టీఆర్‌నగర్ పరిధిలో...

రాజేంద్రనగర్: విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. శివరాంపల్లి, హసన్‌నగర్, ఎన్టీఆర్‌నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామన్నారు. ఉప్పర్‌పల్లి, ఫోర్ట్‌వ్యూ కాలనీ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్‌లలో బుధవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్ చంద్ర తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని 2, 3, 5, 6, 7, 13, 14వ డివిజన్‌లలో వివిధ అభివృద్ధి పనులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ శంకుస్థాపన చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కమిషనర్ కోరారు.

పర్యావరణాన్ని సంరక్షించుకోవాలి



రాజేంద్రనగర్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ కన్వీనర్ మల్లేష్ యాదవ్ అన్నారు. తన జన్మదినం సందర్భంగా మంగళవారం రాజేంద్రనగర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

కాంగ్రెస్ పాలనకే ప్రజామోదం: ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన మధుప్రియ

మణికొండ: కాంగ్రెస్ పార్టీ పాలన ఏడాదిన్నర పూర్తి కావటం, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన అనేక పథకాలను ఇప్పటికే అందిస్తుండటంతో ప్రజలతో పాటు తటస్తులు కూడా పార్టీ పట్ల ఆకర్షితులు అవుతున్నారని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎం.జితేందర్ ఆధ్వర్యంలో పంచవటి కాలనీకి చెందిన సినీనటి మధుకృష్ణ ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద ప్రజలకు అవసరమైన అన్ని రకాల పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా మధుకృష్ణ మాట్లాడుతూ... రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పటిష్ట నాయకత్వం ఉందన్నారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ప్రకాశ్‌గౌడ్ గెలవటం, నిత్యం ప్రజల మధ్యే ఉండే ఆయన ఆధ్వర్యంలో పార్టీలో పనిచేస్తానన్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.మల్లేష్ ముదిరాజ్, మాజీ కౌన్సిలర్‌లు పి.శైలజ వినోద్‌కుమార్, పురుషోత్తం, మైనార్టీ అధ్యక్షుడు హాజీ, నాయకులు బి.శ్రీరాములు, శ్రావణ్‌కుమార్, గంగాధర్, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోనే ప్రజా సంక్షేమం



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా సెక్రటరీ మొండ్ర కొమురయ్య

అత్తాపూర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని బీజేపీ రంగారెడ్డి జిల్లా సెక్రటరీ మొండ్ర కొమురయ్య అన్నారు. ప్రధానమంత్రిగా మోదీ 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం బీజేపీ అత్తాపూర్ డివిజన్ కార్యాలయంలో అధ్యక్షుడు సులిగే వెంకటేష్ అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత 11 సంవత్సరాలుగా మోదీ అవినీతి రహిత పాలన అందిస్తూ దేశానికి మేలు కోరుతూ అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. అందులో భాగంగా 370 ఆర్టికల్, రామ జన్మభూమి తదితర సమస్యలను విజయవంతంగా పరిష్కరించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అందజేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మొండ్ర సంగీతగౌరీశంకర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు విజయ్‌కుమార్, కిరణ్‌చారి, ఆర్.జగన్, రాజుపైల్వాన్, మణికంఠ, సతీష్, శ్రీకాంత్‌చారి, విజయరావత్, అనురాధ, సాయి, ఎం.రాము, బాలకృష్ణ, అనిల్, ప్రవీణ్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళలు సత్తాచాటాలి



మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ పురుషులకు దీటుగా సత్తాచాటుతూ ప్రగతి పథాన సాగాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు 100 రోజుల ప్రణాళికలో భాగంగా మంగళవారం నూతన స్వయం సహాయక సంఘాల ఏర్పాటుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ శరత్‌చంద్ర మాట్లాడుతూ... బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి మహిళా స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా ఉండాలని ఆకాంక్షించారు. అందుకు నూతన సంఘాల ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఆర్థిక పరిపుష్టి, మహిళ సాధికారతను సాధించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు సూచనలు, సలహాలు, అవసరమైన సాయం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామన్నారు. మేనేజర్ టి.పర్వతాల, టీఎంసీ ఎస్.శ్రీలత, సెక్షన్ అసిస్టెంట్ కె.సూర్యప్రకాష్, ఆర్‌పీలు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి



ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

శంషాబాద్: రెండు రోజుల్లో పాఠశాలలు ప్రారంభం కానుండటంతో మధ్యాహ్న భోజనం తీరుపై మండల విద్యాధికారి లక్ష్మణ్ సంబంధిత ఏజెన్సీలతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వంట గదులను వెంటనే పరిశుభ్రంగా మార్చుకోవడంతో పాటు గదులకు సున్నం వేసి ఆహార పదార్థాలు పాడుకాకుండా చూసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనం శుచి, శుభ్రతతో పాటు రుచి, నాణ్యతతో ఉండేలా చూడాలన్నారు. వంటపాత్రలు, వంట గదులను వెంటనే బాగు చేసుకోవాలని సూచించారు కార్యక్రమంలో ఉపాధ్యాయులు దత్తం రెడ్డి, బాల్‌రాజ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో 'పరిసరాల పరిశుభ్రత'



పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న హెచ్ఎం మమత, క్లబ్ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ నేతాజీనగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నవయువ యూత్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొంపల్లి జగదీష్ ఆధ్వర్యంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణలోని పనికిరాని వస్తువులు, వ్యర్థాలను తొలగించడంతో గ్రౌండ్ విశాలంగా, శుభ్రంగా మారి విద్యార్థుల క్రీడలకు అనుకూలంగా మారింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మమత మాట్లాడుతూ... నిస్వార్థ సేవతో పాఠశాల ఆవరణ చాలా పరిశుభ్రంగా మారిందన్నారు. పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించాలన్నారు. ఉపాధ్యాయుడు మహేశ్వర్ మాట్లాడుతూ... పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం ఉంటేనే విద్యార్థులు ఏకాగ్రతతో విద్యను అభ్యసించగలరన్నారు. క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి కొంపల్లి జగదీష్ మాట్లాడుతూ... తమ క్లబ్ యువతను సామాజిక సేవాకార్యక్రమాల్లో యువతను భాగస్వామ్యం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. నేతాజీనగర్ పాఠశాల అభివృద్ధికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఈ అత్యవసర సమస్యల పరిష్కారానికి దాతలు ముందుకు రావాలని కోరారు.

ఈవీఎంల గోదాము తనిఖీ



తనిఖీ చేస్తున్న హరిసింగ్, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ

రాజేంద్రనగర్: రంగారెడ్డి జిల్లాలోని రాజేంద్రనగర్ ఈవీఎంలను ఉంచిన గోదామును గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో త్రైమాసిక తనిఖీలను నిర్వహించారు. భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్‌లు, ఎన్నికల సామగ్రిని, గదులను రాష్ట్ర డిప్యూటీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ బి.హరిసింగ్ జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వివరాల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వారికి సూచించారు. అనంతరం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం భద్రపరిచిన గోడౌన్‌ను వారి సమక్షంలో సీల్ వేయించారు. రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్ రెడ్డి, తహసీల్దార్, వేర్ హౌస్ ఇన్‌చార్జి బొమ్మ రాములు, సంబంధిత అధికారులు, బీజేపీ నేత శ్రీధర్, బీఎస్పీ నాయకుడు శ్రీనివాస్, ఎంఐఎం పార్టీ నాయకుడు తాహెర్ తదితరులు పాల్గొన్నారు.